

మళ్లీ రాకపోకలు బంద్

స్టేషన్ ధారూరు – దోరాక్నల్ గ్రామాల మధ్య కాగ్నా నదిపై తాత్కాలికంగా నిర్మించిన రోడ్డు వర్షానికి కొట్టుకుపోయింది. 8లో ▸



కరెంటుతో జర భద్రం

వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. 9లో ▸

వికారాబాద్ మున్సిపల్ కమిషనర్ బదిలీ

వికారాబాద్ అర్బన్: వికారాబాద్ మున్సిపల్ కమిషనర్ శరత్ చంద్ర బదిలీ అయ్యారు. రెండేళ్లుగా మున్సిపల్ కమిషనర్‌గా ఆయన బాధ్యతలు నిర్వర్తించారు. బదిలీపై బండ్ల గూడ జాగీర్ మున్సిపల్ కమిషనర్‌గా వెళ్లినట్లు సమాచారం. కొత్త కమిషనర్‌గా ముషారఫ్ అలీ బదిలీపై వస్తున్నట్లు తెలిసింది.

అర్ధరాత్రివేళ ముంచెత్తిన వరద



పెద్దేముల్: ఇందూరు గ్రామంలో ప్రవహిస్తున్న వరద



పెద్దేముల్: నీట మునిగిన పత్తి పంట

అర్ధరాత్రి.. ఊరంతా గాఢనిద్రలో ఉంది.. ఒక్కసారిగా భారీ వర్షం.. గంటల వ్యవధిలోనే వరద ఊరును ముంచెత్తింది. ప్రజలు తేరుకునేలోపే ఇళ్లలోకి నీరు చేరింది. నిత్యావసర వస్తువులు, దుస్తులు, యూరియా బస్తాలన్నీ తడిసిముద్దయ్యాయి. ప్రజలు రాత్రంతా బిక్కుబిక్కుమంటూ గడిపారు. ఈ ఘటన పెద్దేముల్ మండలం ఇందూరులో గ్రామంలో చోటుచేసుకుంది. ఊరికి దగ్గరగా పితిరి వాడుగ (వాగు) ఉండటంతో వానాకాలం వచ్చిందంటే గ్రామంలోని ఎస్సీ కాలనీ వాసులకు వరద పాట్లు తప్పడంలేదు.

నీట మునిగిన ఇందూరు గ్రామం

- తడిసిముద్దయిన నిత్యావసర వస్తువులు, ఎరువులు
- రాత్రంతా బిక్కుబిక్కుమంటూ గడిపిన ప్రజలు
- ప్రతిఏటా వానాకాలంలో తప్పనితిప్పలు

పెద్దేముల్: మండల పరిధిలోని ఇందూరు ఎస్సీ కాలనీ వాసులు వర్షాకాలం వచ్చిందంటే భయాందోళనకు గురవుతున్నారు. గ్రామం సమీపంలో పితిరి వాడుగ (వాగు) గ్రామానికి ఆనుకొని ఉంది. వర్షం కురిస్తే చాలు ఇళ్లల్లోకి నీరు వస్తుంది. గ్రామానికి చుట్టు పక్కల అడవి ప్రాంతం ఉండటంతో చిన్నపాటి వర్షం పడినా వరద గ్రామం నడిబొడ్డు నుంచి పొంగి పొర్లుతుంది. తాండూరు–జహీరాబాద్ ప్రధాన రహదారిపై నిర్మించిన వంతెన సైతం సక్రమంగా లేకపోవడంతో ఇళ్లలోకి నీరు చేరుతుంది. ఈ విషయాన్ని పాలకులకు, అధికారులకు ఏటా విన్న వించినా ఎవరూ పట్టించుకోవడంలేదని స్థానికులు వాపోతున్నారు. మంగళవారం అర్ధరాత్రి వేళ భారీ వర్షం కురిసింది. దీంతో ఇళ్లలోకి భారీగా నీరు చేరింది. నిత్యావసర వస్తువులతోపాటు రైతులు సాగు కోసం తెచ్చిన యూరియా బస్తాలన్నీ తడిసి ముద్దయ్యాయి. కంటి పై కునుకులేకుండా తెల్లారే వరకు కట్టలు, గోడలపై కూర్చుని కాలం గడిపారు. ఇంత జరుగుతున్నా పాలకులు, అధికారులు పట్టించుకోవడంలేదని స్థానికులు తెలిపారు. ఇప్పటికైనా గ్రామ సమీపంలోని వాడుకకు మరమ్మతులు చేపట్టి వరద గ్రామంలోకి రాకుండా చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు. లేదంటే ఊరు వదిలి వెళ్లాల్సిన దుస్థితి నెలకొందన్నారు.



దోమ: కూలిన ఇంటి వద్ద బాధితురాలు

52 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు

పెద్దేముల్ మండలంలో భారీ వర్షానికి పంటలు నీట మునిగాయి. గాజీపూర్, బుద్దారం, ఇందూరు వాగుల్లో కొత్త నీరు ప్రవహించింది. రుద్రారం, ఇందూరు, గాజీపూర్, బుద్దారం, నర్సపూర్, హన్మాపూర్ లోతట్టు భూములు నీటిలో మునిగాయి. మండలంలో 52మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.

దుకాణాల్లోకి వర్షం నీరు

కొడంగల్: భారీ వర్షానికి పట్టణంలోని మెయిన్ రోడ్డుపై ఉన్న దుకాణాల్లోకి వర్షం నీరు చేరింది. ఈ మధ్య కాలంలో మెయిన్‌రోడ్డును విస్తరించి సీసీ వేశారు. దుకాణాలు కిందకు, రోడ్డుపైకి అయింది. దీంతో వర్షం కురిస్తే వరద నీరు దుకాణాలు, ఇళ్లలోకి వెళ్తున్నాయి. మంగళవారం రాత్రి 98 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. మున్సిపల్ కమిషనర్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి బుధవారం ఉదయం పట్టణంలో పర్యటించి నష్టాన్ని పరిశీలించారు. బాధితులతో మాట్లాడారు. ఆయన వెంట కౌన్సిలర్ వెంకట్ రెడ్డి తదితరులు ఉన్నారు.

దిర్సంపల్లిలో కూలిన ఇల్లు

దోమ : భారీ వర్షానికి మండల పరిధిలోని దిర్సంపల్లిలో ఇల్లు కూలింది. గ్రామానికి చెందిన చిల్కమూరి మొగులమ్మ బండల ఇల్లు కూలిపోయింది. ఇంట్లో ఉన్న నిత్యావసర సరుకులు, దుస్తులు, తడిసి ముద్దయ్యాయి. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపారు. ప్రభుత్వం స్పందించి డబుల్ బెడ్రూం ఇల్లు మంజూరు చేయాలని బాధిత మహిళ వేడుకుంటోంది.

యాలాలో గాలివాన

యాలాల: మండలంలో కురిసిన భారీ వర్షానికి కాగ్నా, కాకరవేణి నదుల్లో వరద ఉధృతి పెరిగింది. జుంటుపల్లి, శివసాగర్ ప్రాజెక్టులోకి ఎగువనుంచి వరద నీరు భారీగా వచ్చి చేరింది. యాలాల మండల కేంద్రంలో సొసైటీ సమీపంలో ఈదురుగాలులకు చింతచెట్టు విరిగి విద్యుత్ స్తంభంపై నేలకొరిగింది. దీంతో బుధవారం సాయంత్రం వరకు యాలాలలో కరెంటు సరఫరా లేకపోవడంతో అధికారులు, మీసేవ నిర్వాహకులు,ప్రజలు ఇబ్బందులు పడ్డారు. మంగళవారంరాత్రి 136ఎం.ఎంల వర్షపాతం నమోదయినట్లు తహసీల్దార్ గోవిందమ్మ తెలిపారు.



ఎల్మకన్నె చెక్‌డ్యాంలో వరద ఉధృతి

ఎల్మకన్నె చెక్‌డ్యాం పరవళ్లు

- నిండుకుండలా నారాయణపూర్ బ్రిడ్జి
- రైతుల్లో సంతోషం

తాండూరు రూరల్: తాండూరు మండలంలో భారీ వర్షం కురిసింది. చెరువులు, కుంటలు, చెక్ డ్యాంలన్నీ జలకళను సంతరించుకున్నాయి. మంగళవారం అర్ధరాత్రి నుంచి బుధవారం తెల్లవారుజాము వరకు వర్షం కురిసింది. విత్తనాలు విత్తుకున్న రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కొందరు విత్తనాలు విత్తుకునే పనిలో ఉన్నారు. ఇప్పటికే విత్తనాలు విత్తిన పొలాల్లో మొలకలు రావడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో 55.7 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు అయినట్లు వ్యవసాయశాఖ ఏడీఏ రుద్రమూర్తి తెలిపారు. ఎల్మకన్నె చెక్‌డ్యాం వరద నీటితో పరవళ్లు తొక్కుతోంది. ప్రభుత్వం రూ.8.కోట్ల 40 లక్షలతో 250 ఎకరాల ఆయకట్టు సాగునీరు అందించాలనే ఉద్దేశ్యంతో మే నెలల్లో చెక్‌డ్యాం నిర్మాణాన్ని పూర్తి చేశారు. చెక్‌డ్యాం నిర్మించిన తొలిసారే భారీగా నీరు నిలవడంతో చుట్టుపక్కల పొలాల రైతుల్లో ఆనందానికి అవధలు లేకుండా పోయాయి. గతంలో చెక్‌డ్యాం లేకపోవడంతో నీరంతా వృథాగా కర్ణాటకకు తరలివెళ్లిందని రైతులు చెప్పారు. చెక్‌డ్యాం నిర్మాణంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అలాగే నారాయణపూర్ బ్రిడ్జి నిండుకుండలా మారింది.

న్యూస్‌రీల్

9న అర్హత పరీక్ష

వికారాబాద్ అర్బన్: షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సివిల్స్ ప్రిలిమ్స్, మెయిన్స్ కోచింగ్ కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి మల్లేశం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాత పరీక్ష ఈ నెల 9న ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 1:30 గంట వరకు నిర్వహిస్తారని తెలిపారు. అభ్యర్థులు వారి హాల్ టికెట్‌ను స్టడీసర్కిల్ వెబ్‌సైట్ http://www.tsstudycircle.co.inలో డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు.

అభ్యంతరాలు ఉంటే తెలపండి

వికారాబాద్ అర్బన్: జిల్లా విద్యాశాఖలోని సమగ్ర శిక్షా విభాగానికి సంబంధించిన ఎంఐఎస్ కోఆర్డినేటర్, డాటా ఎంట్రీ ఆపరేటర్, ఏపీఓ,ఐఈఆర్‌పీ పోస్టులను భర్తీ చేయడానికి ధ్రువపత్రాల పరిశీలన పూర్తయిందని డీఈఓ రేణుకాదేవి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జాబితాను బుధవారం జిల్లా, మండల విద్యాధికారి కార్యాలయాల్లో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. జాబితాలో ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 6వ తేదీలోగా జిల్లా విద్యాశాఖ అధికారికి తెలియజేయాలన్నారు.

ఆపదలో ఉన్న వారిని ఆదుకుంటా

ఎంపీ రంజిత్‌రెడ్డి



కుర్వ కిష్టయ్యకు ఆర్థిక సహాయం అందిస్తున్న ఎంపీ రంజిత్‌రెడ్డి

ధారూరు: ఆపదలో ఉన్న వారికి ఆపన్నహస్తం అందించడానికి ఎప్పుడూ సిద్ధంగా ఉంటానని ఎంపీ రంజిత్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని దోర్నాల్ గ్రామానికి చెందిన కుర్వ కిష్టయ్యకు చెందిన 50 గొర్రెలు రైలు ప్రమాదంలో మృతి చెందిన విషయం విదితమే. ఈ మేరకు బుధవారం బాధితునికి రూ. 50 వేలు తన నివాసంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపదలో ఎవరూ ఉన్నా తనవంతు సహకారం అందిస్తానని అన్నారు. కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రాజునాయక్, బీఆర్ఎస్ నాయకుడు వెంకట్రాంరెడ్డి పాల్గొన్నారు.

కందిపంటే అధికంగా సాగు

తాండూరు రూరల్: నియోజకవర్గంలో రైతులు కందిపంటను అధికంగా సాగు చేస్తున్నారని వ్యవసాయ శాఖ ఏడీఏ రుద్రమూర్తి అన్నారు. బుధవారం ఆయన తాండూరు ఏడీఏ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. తాండూరు, పెద్దేముల్, యాలాల, బషీరాబాద్ మండలాల్లో లక్షా 56 ఎకరాల్లో వివిధ పంటలను రైతులు సాగు చేస్తున్నారని చెప్పారు. ఇందులో అధికంగా కంది పంట 60 వేల ఎకరాల్లో సాగు చేస్తున్నారని అన్నారు. పత్తి 35 వేల ఎకరాల్లో సాగు చేసే అవకాశం ఉందన్నారు. ఈ నెల 24 వరకు రైతులు విత్తనాలు విత్తుకునేందుకు అవకాశం ఉందని ఏడీఏ పేర్కొన్నారు. కంది, పత్తి, మినుము, పెసర, మొక్కజొన్న, సోయాబీన్, వరి పంటలు సాగు చేసుకోవాలని చెప్పారు.

నేడు సమావేశం

బొంరాస్‌పేట: జిల్లాలో ఉన్న ప్రయివేటు పాఠశాలల యాజమాన్యాలతో గురువారం జిల్లా స్థాయిలో సమావేశం ఉంటుందని బొంరాస్‌పేట, కొడంగల్, దుద్యాల మండలాల ఎంఈఓ రాంరెడ్డి తెలిపారు. డీఈఓ రేణుకాదేవి ఆధ్వర్యంలో ఉదయం 11గంటలకు కలెక్టర్ నూతన భవనంలోని సమావేశపు హాలులో సమీక్షా సమావేశం ఉంటుందన్నారు. ఈ సమావేశంలో 2023–24 విద్యా సంవత్సరం ఫీజుల వివరాలు, బోధనా, బోధనేతర సిబ్బంది వివరాలు, తరగతుల వారీగా విద్యార్థుల నమోదు వివరాలపై సమీక్ష ఉంటుందన్నారు. ఆయా మండలల్లో ప్రయివేటు పాఠశాలల యాజమాన్యం తప్పనిసరిగా హాజరు పాల్గొనాలని ఎంఈఓ సూచించారు.

లోక కల్యాణార్థమే యాగాలు



రాజశ్యామల యాగంలో అమ్మవారిని దర్శించుకుంటున్న గరికపాటి, ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

- పద్మశ్రీ అవార్డు గ్రహీత గరికపాటి నరసింహారావు
- ప్రవచన కర్తను సన్మానించిన ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

తాండూరు: లోకకల్యాణం కోసం యాగాలు చేయడం ఎంతో ఆనందంగా ఉందని పద్మశ్రీ అవార్డు గ్రహీత గరికపాటి నరసింహారావు అన్నారు. బుధవారం తాండూరు పట్టణంలో ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి నిర్వహిస్తున్న రాజశ్యామల, శత చండి, సౌర, లక్ష్మీ సుదర్శన సహిత అతిరుద్ర మహాయాగానికి ప్రముఖ ప్రవచన కర్త, పద్మశ్రీ అవార్డు గ్రహీత గరికపాటి నరసింహరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి గరికపాటికి ఘన స్వాగతం పలికారు. యాగంలో పూజలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన ప్రవచన కార్యక్రమంలో గరికపాటి మాట్లాడారు. తన చలోక్తులతో కూడిన ప్రవచనంతో భక్తులను ఆకట్టుకున్నారు. ప్రజలు మనసు సముంద్రంలా ఉండాలే తప్ప తరంగాలుగా ఉండకూడదన్నారు. రాజశ్యామల యాగానికి తాండూరుకు రావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. అన్ని విధాలుగా కలిసి వచ్చినప్పుడే ఈ యాగం పరిపూర్ణమవుతోందన్నారు. ఉత్సవాలలో ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు విఠల్‌రెడ్డి, శ్రీశైల్‌రెడ్డి ఇందర్‌చెడ్ రాజు (నర్సిరెడ్డి) తాండూరు నియోజకవర్గ నాయకులు, భక్తులు, తదితరులున్నారు.

12 నుంచి పవిత్రోత్సవాలు

- శ్రీవారి ఆలయంలో ఏర్పాట్లు
- రెండేళ్లకు ఒకసారి నిర్వహణ

కొడంగల్: పేదల తిరుపతిగా పేరుగాంచిన మహాలక్ష్మీ వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో ఈనెల 12 నుంచి పవిత్రోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు ఆలయ ధర్మకర్తలు భక్తుల ఇళ్ల దగ్గరకు వెళ్లి ఆహ్వాన పత్రికలు అందిస్తున్నారు. బుధవారం ఆలయ ధర్మకర్త నందారం శ్రీనివాస్ గుప్త, సామాజిక కార్యకర్తలు మురహరి వశిష్ట, బాల ప్రకాశ్‌లు విలేకరులతో మాట్లాడారు. ఆలయ పవిత్రతతో పాటు పట్టణ పురోగతి కోసం పవిత్రోత్సవాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కొడంగల్ శ్రీవారి ఆలయంలో రెండేళ్లకు ఒకసారి పవిత్రోత్సవాలు జరుగుతాయని అన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. తిరుమల తిరుపతి దేవస్థానం అర్చకులతో పాటు ఆలయ అర్చకులు పాల్గొని కార్యక్రమాలను నిర్వహిస్తారని తెలిపారు. తిరుమల తిరుపతి దేవస్థానం తరహాలోనే ఇక్కడ ఆలయంలో వైఖానస ఆగమ శాస్త్ర పద్ధతిలో నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈనెల 12న రాత్రి 7గంటల నుంచి ఆచార్య వచనం, సేనాధిపతి ఉత్సవం, మత్సంగ్రహణం, అంకురార్పణ, వేదారంభం, 13న ఉదయం 9గంటలకు ఉత్సవ మూర్తులకు శతకళశ తిరుమంజనం, మధ్యాహ్నం 12గంటలకు అగ్ని ప్రతిష్ఠ, విశేష హోమాలు, పవిత్ర ప్రతిష్ఠ, రాత్రి 7గంటలకు కుంభావాహన, విశేష హోమములు, 14న ఉదయం 9గంటలకు విశేష ఉక్త హోమములు, పవిత్ర సమర్పణ, రాత్రి 8గంటలకు విశేష హోమాలు, 15న ఉదయం 9గంటలకు విశేష హోమాలతో పాటు పవిత్రోత్సవం రాత్రి 7 గంటలకు మహా పూర్ణాహుతి, ప్రోక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.



అసైన్డ్ భూ సమస్యలు పరిష్కరించండి

- క్షేత్ర స్థాయికి వెళ్లి విచారించండి
- కలెక్టర్ నారాయణ రెడ్డి



అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి, చిత్రంలో అదనపు కలెక్టర్ తదితరులు

వికారాబాద్ అర్బన్: అసైన్డ్ భూముల సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ నారాయణ రెడ్డి అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో అసైన్డ్ భూముల వివరాలపై అటవీ, రెవెన్యూ, రిజర్వ్ ఫారెస్ట్ అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల సహకారంతో అసైన్డ్ భూముల సమస్యల పరిష్కరించాలని తెలిపారు. అసైన్డ్ భూములకు ధరణి పట్టా పాసు పుస్తకం ఉంటేనే రైతుబంధు, రైతు భీమా వర్తింస్తుందని అన్నారు. ఈ విషయంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని పరిష్కారం దిశగా పని చేయాలని సూచించారు. ప్రణాళిక బద్ధంగా అటవీశాఖ, రెవెన్యూ శాఖల అధికారులు, సర్వేయర్లు క్షేత్ర స్థాయిలో పనిచేసి అసైన్డ్ భూములకు సంబంధించి వారం రోజుల్లో ధరణి లాగిన్‌లో స్పష్టంగా వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. అసైన్డ్ భూముల విషయంలో పట్టాదారు లేక వారసుల పేర్లు మాత్రం వచ్చేలా చూడాలన్నారు. క్షేత్ర స్థాయిలో అధికారులు పర్యటించి రైతులు కబ్జాలో ఉన్న మేరకు నివేదికలు అందజేయాలని కలెక్టర్ తెలిపారు. అటవీ భూముల్లో కబ్జా ఉంటే పట్టాలు ఇవ్వడం సాధ్యం కాదనే విషయాన్ని స్పష్టంగా తెలియజేయాలన్నారు. ఈ సందర్భంగా అటవీ శాఖ అధికారి జ్ఞానేశ్వర్, డీడబ్ల్యూఓ కోటాజీ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారి రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్హుల జాబితా ఆన్‌లైన్‌లో ఉంచాలి

కులవృత్తుల వారికి ప్రభుత్వం అందిస్తున్న లక్ష రూపాయల ఆర్థిక సహాయానికి ఎంపికైన అర్హుల జాబితాను ఆన్‌లైన్‌లో ఉంచాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. అనర్హులను గుర్తించరాదన్నారు. జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేయాల్సి ఉన్నప్పటికీ ఇంకా కొన్ని గ్రామాల్లో స్థల సేకరణ కూడా జరగలేదన్నారు. ఈ స్థల సేకరణ సోమవారం నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. హరితహారంలో భాగంగా ఇప్పటి ఇప్పటివరకు 8 విడతల్లో మొక్కలు నాటామన్నారు. అయినా ఆశించిన స్థాయిలో ఫలితం రాలేదన్నారు. ఈ సారి 9వ విడతలో పకడ్బందీగా మొక్కలు నాటాలని ఆదేశించారు. వైకుంఠధామాల్లో అసంపూర్తిగా ఉన్న పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. మన ఊరు–మనబడి కింద చేపట్టిన పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ పాల్గొన్నారు.

రెండు రోజుల్లో శుభకార్యం.. అంతలోనే తీరని శోకం

రోడ్డు ప్రమాదంలో తల్లీకుమారుడు మృతి

- బంధువులకు చెప్పి వస్తుండగా ఘటన
- మొండిగౌరెల్లిలో విషాదం

యాచారం: రెండు రోజుల్లో శుభకార్యం.. ఇంతలోనే ఆ ఇంట్లో తీరని విషాదం నెలకొంది. రోడ్డు ప్రమాదంలో తల్లీకుమారుడు మృతిచెందడంతో శోకసంద్రమైంది. మండల పరిధిలోని మొండిగౌరెల్లిలో బుధవారం జరిగిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కర్నాటి నారమ్మ(50) ఆమె కొడుకు యాదయ్య తమ ఇంట్లో ఈ నెల 7న జరిగే శుభకార్యం కోసం హయత్‌నగర్‌లోని తమ బంధువులకు చెప్పి బైక్‌పై వస్తున్నారు. మార్గమధ్యలో మరో బంధువు ఇంటికి వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నారమ్మ అక్కడికక్కడే మృతి చెందగా.. తీవ్రంగా గాయపడిన యాదయ్య నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. తల్లీకుమారుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. యాదయ్య కూతురి శారీ ఫంక్షన్ జరగాల్సి ఉండగా విషాదం నెలకొనడంతో కుటుంబ సభ్యులు కన్నీటిపర్యంతమయ్యారు. పోస్టుమార్టం కోసం మృతదేహాలను ఇబ్రహీంపట్నం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. యాచారం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. గుర్తుతెలియని వాహనం డ్రైవర్ కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



నారమ్మ



యాదయ్య

క్లుప్తంగా

పాఠశాలలో పాముల కలకలం



చంపిన పాములను చూపుతున్న విద్యార్థులు

దౌల్తాబాద్: పాఠశాల ఆవరణలో ఏకంగా ఎనిమిది పాములు కనిపించడంతో ఒక్కసారిగా విద్యార్థులు, సిబ్బంది భయాందోళనకు గురయ్యారు. ఈ ఘటన మండలంలోని సుల్తాన్‌పూర్ ప్రభుత్వ పాఠశాలలో చోటుచేసుకుంది. ఉదయం పాఠశాల తెరిచే సమయానికి ఆవరణలో ఉన్న గోడల్లో ఎనిమిది పాములు తిరుగుతూ కనిపించాయి. వెంటనే ఉపాధ్యాయులు స్థానికులను పిలిచి పాములను చంపించారు. ఒక్కసారిగా ఎనిమిది పాములు కనిపించడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు భయాందోళనకు చెందుతున్నారు.

హక్కుల సాధనకే బ్రహ్మ గర్జన

బ్రాహ్మణ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జయతీర్థాచారి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బ్రాహ్మణ సంఘం నాయకులు

కొడంగల్ రూరల్: హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ స్టేడియంలో ఈ నెల 9వ తేదీ మధ్యాహ్నం 2గంటలకు ప్రారంభం కానున్న బ్రహ్మ గర్జన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బ్రాహ్మణ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు లోకూర్తి జయతీర్థాచారి పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని శ్రీ మహాలక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయ ఆవరణలో ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బ్రహ్మ గర్జన కార్యక్రమంలో 10వేల మంది మహిళలతో శ్రీ లలితా విష్ణు సహస్ర నామ పారాయణం, వేద ఘోష, పీఠాధిపతుల అనుగ్రహ భాషణం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. బ్రాహ్మణుల హక్కుల కోసం, ఆత్మగౌరవం కోసం జరిగే పోరాటానికి బ్రాహ్మణులు, సంఘాల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

బండి సంజయ్ తొలగింపు దారుణం

బీసీ సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు రాజ్‌కుమార్



తాండూరు టౌన్: బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి నుంచి బీసీ సామాజిక వర్గానికి చెందిన బండి సంజయ్ తొలగించడం దారుణమని బీసీ సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు రాజ్‌కుమార్ బుధవారం అన్నారు. బీసీ బిడ్డ ఎదుగుదలను చూసి ఓర్వలేక అగ్రవర్ణ నాయకులంతా కలిసి చేసిన కుట్ర అని ఆరోపించారు. అగ్రవర్ణాలకు చెందిన కిషన్‌రెడ్డిని నూతన అధ్యక్షుడిగా నియమించిన బీజేపీ బీసీలను అవమానించిందన్నారు. వెంటనే నాయకత్వాన్ని మార్చి మరో బహుజన బిడ్డ అయిన ఈటెల రాజేందర్, ధర్మపురి అరవింద్, సోయం బాబూరావుల్లో ఎవరికైనా పార్టీ పగ్గాలు అప్పగించాలని ఆయన డిమాండ్ చేశారు.

తాండూరు మున్సిపల్ కమిషనర్‌గా షఫీవుల్లా



షఫీవుల్లా

తాండూరు టౌన్: మున్సిపల్ కమిషనర్‌గా షఫీవుల్లా బుధవారం బాధ్యతలు స్వీకరించారు. రంగారెడ్డి జిల్లా మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్‌గా కొనసాగిన ఆయన బదిలీపై తాండూరుకు వచ్చారు. గతంలో ఇక్కడ పని చేసిన శంకర్ సింగ్ బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా నూతన కమిషనర్ షఫీవుల్లా మాట్లాడుతూ.. పారిశుద్ధ్య మెరుగుకు, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఆయనకు మున్సిపల్ మేనేజర్ నరేందర్‌రెడ్డి, డీఈఈ రంగనాథ్, ఏఈ ఖాజా, సిబ్బంది స్వాగతం పలికారు.

ప్రవేశాలు లేక పాఠశాల మూసివేత

ఆందోళనకు దిగిన విద్యార్థుల తల్లిదండ్రులు

- యాజమాన్యంతో వాగ్వాదం
- బకాయి ఫీజులు చెల్లిస్తేనే టీసీలు ఇస్తామని కొర్రీ
- ఒకేసారి కట్టలేమని తేల్చి చెప్పిన తల్లిదండ్రులు



ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్‌తో వాగ్వాదానికి దిగిన విద్యార్థుల తల్లిదండ్రులు

తాండూరు: ఆశించిన స్థాయిలో అడ్మిషన్లు రాలేదన్న కారణంతో తాండూరులోని బ్రిలియంట్ స్కూల్‌ను యాజమాన్యం మూసివేయడంతో బుధవారం ఆ పాఠశాల ఎదుట విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు. వివరాలు ఇలా ఉన్నాయి. ప్రస్తుత విద్యా సంవత్సరం ప్రారంభంలో బ్రిలియంట్ స్కూల్‌లో అడ్మిషన్లు మొదలు పెట్టడంతో తల్లిదండ్రులు వారి పిల్లలను చేర్చారు. అయితే ఆశించిన స్థాయిలో అడ్మిషన్లు లేవన్న కారణంతో నాలుగు రోజుల క్రితం పాఠశాలను మూసి వేశారు. ఈ విషయం తెలియని తల్లిదండ్రులు తమ పిల్లలను స్కూల్‌కి పంపారు. తరగతి గదులకు తాళం ఉండటంతో ఇంటికి వెళ్లిపోయారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులకు పాఠశాలకు వచ్చి తరగతులు ఎందుకు నిర్వహించలేదని ప్రశ్నించారు. బకాయి ఫీజులు చెల్లించి టీసీలు తీసుకెళ్లాలని పాఠశాల నిర్వాహకులు విద్యార్థుల తల్లిదండ్రులకు చెప్పారు. దీంతో పలువురు వాగ్వాదానికి దిగారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ.. గుర్తింపు పొందిన విద్యా సంస్థ కావడంతో తమ పిల్లలను పాఠశాలలో చేర్పించామన్నారు. అయితే విద్యార్థుల సంఖ్య లేదని పాఠశాలను మూసి వేయడం ఏమిటని ప్రశ్నించారు. బకాయిలు చెల్లిస్తేనే టీసీలు ఇస్తామని అంటున్నారని వారు తెలిపారు. ఈ విషయాన్ని ఎంఈఓకు ఫిర్యాదు చేశామన్నారు. పాఠశాల కొనసాగిస్తే విడతల వారీగా ఫీజు చెల్లించే వెసులుబాటు ఉంటుందని తల్లిదండ్రులు తెలిపారు. విద్యార్థులకు న్యాయం చేయాలని వారు కోరారు.

యాజమాన్య ఆదేశాలతో మూసివేశాం

పాఠశాలలో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండడంతో మూసి వేయాలని నిర్వాహకులు ఆదేశించారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో చేరిన విద్యార్థులకు ఫీజులు చెల్లించాం. పాత విద్యార్థులకు సంబంధించి ఫీజు బకాయిలు ఉన్నాయి. వాటిని కట్టాలని కోరడంతో కొందరు కావాలనే గొడవకు దిగుతున్నారు.

– విజయ్‌కుమార్ ప్రిన్సిపాల్, బ్రిలియంట్ గ్రామర్ స్కూల్

రికార్డులు స్వాధీనం చేసుకుంటాం

బ్రిలియంట్ గ్రామర్ స్కూల్ మూసి వేస్తే రికార్డులు స్వాధీనం చేసుకుంటాం. అయితే పాఠశాల మూసివేతపై తనకు సమాచారం లేదు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో అడ్మిషన్ తీసుకున్న వారికి టీసీతో ఫీజు తిరిగి చెల్లించాలి. ఈ విషయాన్ని జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్తా. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూసా.

– వెంకటయ్యగౌడ్, విద్యాశాఖ మండల అధికారి, తాండూరు

వ్యవసాయ రంగానికి పెద్దపీట

- పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి
- కుల్కచర్లలో విత్తనశుద్ధి కేంద్రం ఏర్పాటుకు శంకుస్థాపన
- తెలంగాణలోనే ఇది మూడోది

కుల్కచర్ల: వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేసే దిశగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం విశేష కృషి చేస్తోందని పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. బుధవారం కుల్కచర్ల మండల కేంద్రంలో విత్తన శుద్ధి కేంద్రానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జిల్లా రైతాంగానికి మేలు చేసేందుకు విత్తన శుద్ధి కేంద్రం, గోదాం నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఇందు కోసం రూ. 36.61లక్షలు ఖర్చు చేయనున్నట్లు వివరించారు. రాష్ట్రంలో ఇది మూడో విత్తన శుద్ధి కేంద్రమని పేర్కొన్నారు. ఇది అందుబాటులోకి వస్తే ఈ ప్రాంత రైతాంగానికి ఎంతో మేలు చేకూరుతుందని తెలిపారు. రైతుబంధు అమలు, ఎరువులకు ఇబ్బంది లేకుండా చూడడం, సాగుకు సరిపడా విద్యుత్, నీటి వసతి అందేలా ప్రభుత్వం కృషి చేస్తుండడంతో మంచి ఫలితాలు వస్తున్నాయని పేర్కొన్నారు. వ్యవసాయంతోపాటు అనుబంధ రంగాల అభ్యున్నతికి భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో ఎంపీపీ సత్యాహరిశ్చంద్ర, జెడ్పీటీసీ రాందాస్ నాయక్, వైస్ ఎంపీపీ రాజశేఖర్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శేరిరాంరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ హరికృష్ణ, రైతుబంధు మండల అధ్యక్షుడు రాజు, వ్యవసాయాధికారి వీరస్వామి, ఏపీఎం శోభ, కుల్కచర్ల సర్పంచ్ సౌమ్యారెడ్డి, ఎంపీటీసీ ఆనందం, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు జోగు వెంకటయ్య, మొగులయ్య, కృష్ణయ్య, ఆంజనేయులు, రాములు, బాలయ్య, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.



విత్తనశుద్ధి కేంద్రానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

వర్షానికి కూలిన పాఠశాల సన్‌సైడ్



వర్షానికి కూలిన పాఠశాల ముందుభాగం

రాత్రివేళ జరగడంతో తప్పిన ముప్పు

యాలాల: మండలంలో రాత్రి ఎడతెరపి లేకుండా కురిసిన భారీ వర్షానికి రేళ్లగడ్డతండా ప్రాథమిక పాఠశాల భవనం సన్‌సైడ్ కూలిపోయింది. అర్ధ రాత్రి ఈ ఘటన జరగడంతో పెను ప్రమాదం తప్పింది. వివరాలు ఇలా ఉన్నాయి.. రేళ్లగడ్డ తండా ప్రాథమిక పాఠశాలలో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు 63 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇద్దరు ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నారు. ఐదు తరగతులకు రెండు గదులుండగా, వాటిలో ఒకటి శిథిలావస్థకు చేరింది. మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి సన్‌సైడ్ కూలిపోయింది. మరుసటి రోజు ఉదయం పాఠశాలకు వచ్చిన ఉపాధ్యాయులు రాత్రి వేళ కూలడంతో ప్రమాదం తప్పిందని ఊపిరి పీల్చుకున్నారు. ఇదిలా ఉండగా గ్రామంలో పాఠశాల నూతన భవన నిర్మాణానికి జెడ్పీ నిధులు మంజూరయ్యాయి. పనులు చేపట్టిన కాంట్రాక్టర్ బిల్లులు రాకపోవడంతో స్కూల్‌కు తాళం వేశాడు. విద్యార్థుల చదువుకు ఇబ్బంది అవుతుందని స్థానిక హెచ్‌ఎం పరమేష్ సదరు కాంట్రాక్టర్‌ను ఒప్పించి తరగతులు నిర్వహిస్తున్నాడు. ప్రస్తుతం ఒకే గదిలో ఐదు తరగతులను నిర్వహిస్తున్నట్లు హెచ్‌ఎం తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం పాఠశాలకు కొత్త భవనం నిర్మించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

‘సీఈఐఆర్’తో సెల్‌ఫోన్ చోరీలకు చెక్

- కొత్త సాంకేతికతో పోయిన ఫోన్ల గుర్తింపు
- జిల్లాలో ఇప్పటి వరకు 631 ఫిర్యాదులు, ఛేదించిన కేసులు 197
- 52మందికి ఫోన్ల అప్పగింత



బాధితులకు సెల్‌ఫోన్లు అందజేస్తున్న ఎస్పీ

తాండూరు: సెల్ ఫోన్ పోయినా.. చోరీకి గురైనా ఇక ఆందోళన చెందాల్సిన పనిలేదు. పోలీసు శాఖ సీఈఐఆర్ సాంకేతిక విధానం ద్వారా సెల్ ఫోన్లను గుర్తించి బాధితులకు అందజేస్తోంది. ఈ ఏడాది ఏప్రిల్ 20న జిల్లాలో సీఈఐఆర్ (సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్) సాంకేతిక విధానం అందుబాటులోకి వచ్చింది. దీంతో మంచి ఫలితాలు వస్తున్నాయి. మనిషి జీవితంలో సెల్‌ఫోన్ ఒక భాగమైపోయింది. సెల్ ఫోన్ పోయినా, చోరీకి గురైనా అనేక లావాదేవీలు ఆగిపోతాయి. సెల్ ఫోన్ ద్వారా ఎన్నో రకాల సేవలు పొందుతున్నారు. కొంత కాలంగా సెల్‌ఫోన్ చోరీ బాధితుల సంఖ్య పెరిగిపోతోంది. ఏ మాత్రం ఏమరపాటుగా ఉన్నా సెల్‌ఫోన్లను క్షణాల్లో మాయం చేస్తున్నారు. అలాంటి వారి ఆటకట్టించే పనిలో పోలీసు శాఖ నిమగ్నమైంది.

మూడు నెలల్లో 631 కేసులు

సెల్‌ఫోన్ కేసులను ఛేదించేందుకు ఎస్పీ కోటిరెడ్డి ఆధ్వర్యంలో ఏప్రిల్ 20న సీఐఆర్ విధానం అందుబాటులోకి వచ్చింది. సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న వారు, చోరీకి గురైన వారి కోసం ఎస్పీ కార్యాలయ పరిధిలో మూడు సబ్ డివిజన్లు ఏర్పాటు చేశారు. ఈ సబ్ డివిజన్ల పరిధిలో సాంకేతిక పరిజ్ఞానంలో అనుభవం కలిగిన సిబ్బందిని నియమించారు. జిల్లాలోని 23 పోలీస్‌స్టేషన్ల పరిధిలో సెల్‌ఫోన్ చోరీ, పోయిన కేసులు నమోదైతే సంబంధిత విభాగం వెంటనే సీఈఐఆర్ లాగిన్ లోకి వెళ్లి సెల్‌ఫోన్ నంబర్‌ను బ్లాక్ చేస్తారు. బ్లాక్ చేసిన ఫోన్‌ను ఆన్ చేసి సిమ్ వేసిన వెంటనే అది ఉన్న లోకేషన్ పోలీసులకు తెలిసిపోతుంది. దీంతో ఫోన్లను రికవరీ చేసుకునే అవకాశం కలుగుతుంది. నూతన సాంకేతిక విధానం అందుబాటులోకి వచ్చిన నాటి నుంచి మూడు సబ్ డివిజన్ల పరిధిలో మొత్తం 631 మంది తమ సెల్‌ఫోన్లు పోయాయని ఫిర్యాదు చేశారు. వీటిలో 197 కేసులను ఛేదించారు. 52 మంది బాధితులకు సుమారు రూ.8 లక్షల విలువ చేసే ఫోన్లను తిరిగి అప్పగించారు. తాండూరు సబ్‌డివిజన్ పరిధిలో అత్యధిక కేసులను ఛేదించారు.



సీఈఐఆర్ లోగో

సెల్‌ఫోన్లను చోరీ చేస్తే శిక్షార్హులు

జిల్లాలో సెల్‌ఫోన్లు పోయినట్లు ఫిర్యాదు వస్తే సీఈఐఆర్ విధానం ద్వారా వివరాలు సేకరిస్తున్నాం. ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు 52మందికి సెల్‌ఫోన్లు తిరిగి అప్పగించాం. ఎవరికైనా సెల్‌ఫోన్లు దొరికితే పోలీస్‌స్టేషన్‌లో అప్పగించాలి. అలాగే సెల్‌ఫోన్ల చోరీ నేరం. శిక్షార్హులు అవుతారు.

– కోటిరెడ్డి, ఎస్పీ, వికారాబాద్ జిల్లా

విద్యార్థులకు ఇబ్బందులు కలిగించొద్దు

గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ నాయక్

కుల్కచర్ల: విద్యార్థులకు ఇబ్బందులు కలిగిస్తే సహించేది లేదని గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ నాయక్ అన్నారు. బుధవారం చౌడాపూర్ మండలం కొత్తపల్లి పరిధిలోని గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుపేద గిరిజన విద్యార్థుల పట్ల ప్రభుత్వం చిన్నచూపు చూడడం సరికాదన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. విద్యావ్యవస్థ పరిరక్షణలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ప్రతి గురుకుల పాఠశాలలో విద్యార్థులు సమస్యలతో సహవాసం చేస్తున్నారని తెలిపారు. విద్యార్థి సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే జిల్లా గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు సునీల్ నాయక్, అనిల్ నాయక్, గణేష్, అరవింద్, శివరాం నాయక్, సంతోష్, శివ తదితరులు పాల్గొన్నారు.



గురుకుల విద్యార్థులతో మాట్లాడుతున్న శ్రీనివాస్ నాయక్

తిరుమలేశుని సన్నిధిలో ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి



తిరుమలలో ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి, తనయుడు హితీష్‌రెడ్డి

కొడంగల్: ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి బుధవారం తిరుమలలో శ్రీ వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. కుమారుడు హితీష్‌రెడ్డితో కలిసి శ్రీవారి దర్శనం చేసుకున్నారు. నియోజకవర్గ ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని ఎమ్మెల్యే శ్రీవారిని ప్రార్థించినట్లు ఆయన వ్యక్తిగత సిబ్బంది తెలిపారు. తెలంగాణలో మూడోసారి విజయం సాధించి కేసీఆర్ మరోమారు సీఎం కావాలని కోరుకున్నట్లు ఆయన చెప్పారు.

‘గృహలక్ష్మి’కి రూ.6 లక్షలు ఇవ్వాలి

సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు జంగయ్య

కొందుర్గు: గృహలక్ష్మి పథకానికి రూ.6లక్షలు ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బుద్దుల జంగయ్య డిమాండ్ చేశారు. జిల్లేడ్ చౌదరిగూడ మండలం లాల్‌పహాడ్‌లో బుధవారం సీపీఐ ముఖ్య కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు, దళితులకు మూడెకరాల భూమి, కేజీ టూ పీజీ ఉచిత విద్య తదితర హామీలిచ్చిన ప్రభుత్వం నేటికీ నెరవర్చలేదన్నారు. పాలమూరు ఎత్తిపోతల పథకం నోరు మెదపడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గృహలక్ష్మి పథకంలో కేవలం రూ.3లక్షలు ఇస్తే ఇంటి నిర్మాణం పూర్తవుతుందా అని ప్రశ్నించారు. కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు స్వీకరించి ఏళ్లు గడుస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. సమస్యల సాధన కోసం గురువారం ఇందిరా పార్క్ వద్ద చేపడుతున్న ధర్నాకు అన్ని గ్రామాల ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు బాల్‌రాజ్, చిన్నయ్య, అనంతలక్ష్మి, బాలమ్మ, రాములమ్మ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ ప్రజలకు చేసిందేమీ లేదు

మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్

మర్పల్లి: సీఎం కేసీఆర్ నియంత పాలనకు చరమగీతం పాడాలని మాజీ మంత్రి గడ్డం ప్రసాద్ కుమార్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని సిరిపురంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే పంట రుణాలను ఏక కాలంలో మాఫీ చేస్తామన్నారు. రూ. 500లకే వంట గ్యాస్ ఇస్తామన్నారు. పంట సాగు పెట్టుబడి ప్రతి ఏటా రూ.15 వేలు, కౌలు రైతులకు ఎకరాకు రూ. 12 వేలు ఇస్తామన్నారు. 18 సంవత్సరాలు నిండిన ఆడపిల్లలు కళాశాల చదువుల కోసం ఎలక్ట్రిక్ బైక్ ఇస్తామన్నారు. స్థలం ఉండి ఇళ్లు కట్టుకోలేని వారికి రూ. 5 లక్షలు ఇస్తామని, రూ. 4 వేల పింఛన్ ఇస్తామని ప్రకటించారు. బీజేపీ, బీఆర్‌ఎస్ పాలనలో పేదలకు చేసింది ఏమీ లేదని ఆరోపించారు. ప్రజలంతా కాంగ్రెస్ వైపు చూస్తున్నారని, కార్యకర్తలు కలిసి కట్టుగా పనిచేసి కాంగ్రెస్ గెలుపునకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలకు చెందిన 40 మంది కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. వారికి మాజీ మంత్రి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకుడు శంకరయ్యగౌడ్, మండల అధ్యక్షుడు రవీందర్, మండల కార్య నిర్వాహక అధ్యక్షులు లక్ష్మారెడ్డి, సురేష్, ఉపాధ్యక్షులు సలీం, గోపాల్, బీసీ సెల్ మండల అధ్యక్షుడు సర్వేశ్, నియోజకవర్గ ఇన్‌చార్జ్ రఘుపతిరెడ్డి, సోషల్ మీడియా మండల ఇన్‌చార్జ్ తులసీదాస్, సేవాదళ్ రాష్ట్ర నాయకుడు రాజిరెడ్డి, నాయకులు వెంకట్‌రాంరెడ్డి, సంగమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



కండువాలు కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న ప్రసాద్‌కుమార్

మళ్లీ రాకపోకలు బంద్

- కొట్టుకుపోయిన తాత్కాలిక రోడ్డు
- 6 కిలోమీటర్లకు 26 కిలోమీటర్ల ప్రయాణం
- వంతెన నిర్మాణంలో నిర్లక్ష్యం వల్లే సమస్య
- ప్రజాప్రతినిధులపై పలు గ్రామాల ప్రజల ఆగ్రహం



ఉధృతంగా ప్రవహిస్తున్న కాగ్నా నది

ధారూరు: మండలంలోని స్టేషన్ ధారూరు – దోరాన్నల్ గ్రామాల మధ్య కాగ్నా నదిపై తాత్కాలికంగా నిర్మించిన రోడ్డు మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి కొట్టుకుపోయింది. దీంతో రాకపోకలను ఆపేశారు. సాయంత్రం నీటి ప్రవాహం తగ్గడంతో పాదచారులు నది దాటి వెళ్లారు. కాగ్నా నదిపై వంతెన నిర్మిస్తుండడంతో తాత్కాలిక రోడ్డు వేశారు. వంతెన నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయని, వర్షాలు పడిన ప్రతి సారీ గ్రామానికి రాకపోకలు ఆగిపోతున్నాయని ప్రజలు తెలిపారు. ధారూరు నుంచి దోర్నాల్, అంపల్లి, గురుదోట్ల, పీసీఎం తండా, నాగారం, మైలారం, మోమిన్‌కలాన్, రాజాపూర్, మోమిన్‌ఖుర్దు, తాండూర్ మండలం రాస్నం, బోమిరెస్‌పేట్ మండలం మదనపల్లి గ్రామాలకు వెళ్లాలంటే ఈ వంతెన దాటాల్సిందే. మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి తాత్కాలిక రోడ్డు కొట్టుకుపోవడంతో బుధవారం ఉదయం నుంచి రాకపోకలను పూర్తిగా బంద్ చేయించారు. విద్యార్థులు పాఠశాలకు వెళ్లలేక పోయారు. ధారూరుకు 6 కిలోమీటర్ల దూరంలో ఉన్న దోర్నాల్ ప్రజలు ప్రస్తుతం 26 కిలోమీటర్ల ప్రయాణం చేసి మండల కేంద్రానికి చేరుకుంటున్నారు. రెండేళ్ల క్రితం కొంతమంది కాగ్నా నదిపై నిర్మించిన చెక్ డ్యాం పైనుంచి నడిచి వెళుతూ వారిలో ఒకరు అందులో పడి చనిపోయాడని అయినా పాలకుల్లో బ్రిడ్జి పూర్తి చేయాలన్న ఆలోచన లేదని పలు గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు.



దోర్నాల్ దారిని మూసి వేసి వేస్తున్న అధికారులు

పనుల్లో జాప్యం

కాగ్నా నదిపై వంతెన శిథిలావస్థకు చేరడంతో ఆరేళ్ల క్రితం స్టేషన్ ధారూరు – దోర్నాల్ గ్రామాల మధ్య కొత్త వంతెన నిర్మాణానికి ప్రభుత్వం రూ. 4.70 కోట్లు మంజూరు చేసింది. బిల్లులు సకాలంలో రాకపోవడంతో కాంట్రాక్టర్ పనులు ఆపేశాడు.

ప్రజల రవాణా కష్టాలు తీర్చాలి

తాత్కాలిక రోడ్డు కొట్టుకుపోవడంతో ధారూరు, కేరెళ్లి, జైదుపల్లి, తరిగోపుల మైలారం, నాగారంల మీదుగా దోర్నాల్‌కు ప్రజలు రావాల్సి వస్తోందని సర్పంచ్ సుజాత ఆవేదన వ్యక్తం చేశారు. మరి కొంత మంది 26 కిలోమీటర్లు ప్రయాణం చేయలేక ప్రాణాలకు తెగించి వాగు దాటుతున్నారని తెలిపారు. ఏ మాత్రం పట్టు తప్పినా నీటి ప్రవాహానికి కొట్టుకుపోవడం ఖాయమని తెలిపారు. ప్రతి ఏటా వానాకాలంలో ఇదే పరిస్థితి ఉందని పేర్కొన్నారు. వెంటనే వంతెన నిర్మాణ పనులు పూర్తి చేస్తే పలు గ్రామాల ప్రజలకు రవాణా కష్టాలు తీరుతాయని ఆమె తెలిపారు. ఆ దిశగా అధికారులు చొరవ తీసుకోవాలని సూచించారు.

రారెత్తిస్తున్న టమాటా

మంట పుట్టిస్తున్న మిర్చి

తాండూరు: కూరగాయల ధరలు రోజురోజుకూ ఆకాశాన్ని అంటుతున్నాయి. మటన్, చికెన్ ధరలు కూడా పెరగడంతో జనాలు ఏం కొనలేని పరిస్థితిలో ఉన్నారు. పప్పుదినుసుల ధరలు సైతం చుక్కలను అంటాయి. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వారం రోజుల నుంచి టమాటా, మిర్చి ధరలు అమాంతం పెరిగాయి. పక్షం రోజులుగా కూరగాయల ధరలు పెరుగుతూ వస్తున్నాయి. 15 రోజుల క్రితం కిలో టమాటా రూ.40 పలికింది. ప్రస్తుతం రూ.160కి చేరింది. మరో వైపు పచ్చిమిర్చి రూ.150 పలుకుతోంది. మిగిలిన కూరగాయలు కూడా రూ.50పై మాటే. అల్లం, వెల్లుల్లి ధరలు కూడా పెరిగాయి. కిలో అల్లం ధర రూ.250 కాగా వెల్లుల్లి రూ.200లకు చేరింది. దీంతో సామాన్యులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



టమాటా



పచ్చి మిర్చి

జీ ప్యాట్‌లో రజితకు జాతీయ స్థాయి ర్యాంక్



రజిత

బొంరాస్‌పేట: నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించిన జీ ప్యాట్ పరీక్షలో మండల కేంద్రానికి చెందిన గోపాల్, సంగమ్మ దంపతుల కూతురు, ఫార్మసీ విద్యార్థిని రజిత జాతీయ స్థాయిలో ర్యాంక్ సాధించింది. 518వ ర్యాంక్ రావడంతో ప్రభుత్వం నుంచి ప్రతినెలా రూ.12 వేల ఉపకార వేతనం అందుకోనుంది. విద్యార్థి రజితను పెయింటింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటయ్య తదితరులు అభినందించారు.